

సుంకేసులకు ఇన్‌ఫ్లో

గూడూరు: సుంకేసుల రిజర్వాయర్‌కు 1,150 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. కేసీ కాల్వకు 1,930 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. డ్యాంలో 1.068 టీఎంసీల నీరు నిల్వ ఉంది.



మహానందిలో భక్తుల రద్దీ

మహానంది: కార్తీకమాసం, శుద్ధ ఏకాదశి సందర్భంగా మహానంది క్షేత్రం గురువారం భక్తజనంతో కిటకిటలాడింది. వేదపండితుడు రవిశంకర అవధాని ఆధ్వర్యంలో రాహుకేతు పూజలు చేశారు.



విత్తన పత్తికి జైకొట్టారు

ఈ ఏడాది వర్షాభావ పరిస్థితుల కారణంగా రైతులు విత్తన పత్తికి జైకొట్టారు. నంద్యాల జిల్లాలో 10,411 హెక్టార్లలో వాణిజ్య, సీడ్ పత్తి సాగు చేశారు. 8లో▸

న్యూస్‌రీల్

జిల్లాలో కరువు ఉపశమన చర్యలు

- కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్

నంద్యాల(సెంట్రల్): జిల్లాలో కరువు ఉపశమన చర్యలను ప్రారంభించాలని అధికారులను కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ ఆదేశించారు. ప్రజల సౌకర్యార్థం ఆ వివరాలను ప్రభుత్వ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచాలని సూచించారు. జిల్లాలో కరువు మండలాలను నిర్ధారిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో బనగానపల్లె, మిడుతూరు, పగిడ్యాల, గడివేముల, బేతంచెర్ల మండలాల్లో తీవ్ర కరువు ఉండగా, పాణ్యం మండలంలో ఓ మోస్తరుగా ఉన్నట్లు పేర్కొన్నారు. జిల్లాలోని పురపాలక, పట్టణ, సాగునీటి పారుదల సౌకర్యం కలిగిన ప్రాంతాలను కరువు జాబితా నుంచి మినహాయిస్తున్నామని తెలిపారు. అయితే తాగునీటి విషయంలో ఈ ప్రాంతాలను కూడా కరువు ప్రాంతాలతో పాటు సమానంగా పరిగణిస్తున్నామని పేర్కొన్నారు. అధికారులు కరువు సహాయ కార్యక్రమాలను ప్రారంభించి, ప్రగతి నివేదికలను జిల్లా యంత్రాంగానికి సమర్పించాలని ఆదేశించారు.

నిప్పులవాగుకు 614 క్యూసెక్కుల నీరు



కేసీకాల్వలో ప్రవహిస్తున్న సాగునీరు

జూపాడుబంగ్లా: నిప్పులవాగుకు 614 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నట్లు కేసీ కాల్వ ఏఈ శ్రీనివాసనాయక్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సుంకేసుల డ్యాం నుంచి కేసీ కాల్వకు 1,900 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తుండగా ఈ నీరు లాకిన్స్‌లా వరకు 1,285 క్యూసెక్కులు చేరుతోందన్నారు. నిప్పులవాగుకు 614 క్యూసెక్కులు, తూడిచెర్ల సబ్‌ఛానల్ కాల్వకు 655 క్యూసెక్కులు, అలగనూరు రిజర్వాయర్ కాల్వకు 20 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం నుంచి శుక్రవారం నీటి పంపింగ్ పునః ప్రారంభించనున్న నేపథ్యంలో కేసీ కాల్వకు మరింతగా సాగునీరు పెరిగే అవకాశం ఉందన్నారు. రైతులు నీటిని వృథా చేయకుండా సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఆర్‌యూ ఇన్‌చార్జి వీసీగా ఫజుల్ రహిమాన్?

కర్నూలు(సెంట్రల్): రాయలసీమ యూనివర్సిటీ ఇన్‌చార్జ్ వైస్‌చాన్స్‌లర్‌గా డాక్టర్ అబ్దుల్ హక్ యూనివర్సిటీ వీసీ ఫజుల్ రహిమాన్‌ను నియమించినట్లు తెలుస్తోంది. ఆర్‌యూ వైస్ చాన్స్‌లర్‌గా ఉన్న ప్రొఫెసర్ ఆనందరావు పదవీ కాలం శుక్రవారంతో ముగుస్తుంది. ఈ క్రమంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా తన పదవీ కాలం ముగుస్తున్న నేపథ్యంలో గురువారం ఈసీ సమావేశం నిర్వహించి.. తనకు కావలసిన వారికి మేలు చేసేలా వీసీ నిర్ణయాలు తీసుకున్నట్లు విమర్శలు వచ్చాయి. రిటైర్డ్ రిజిస్ట్రార్ మధుసూదన రావు పెన్షన్‌కు ఆమోదం తెలిపినట్లు తెలిసింది. అలాగే బయోకెమిస్ట్రీ, కెమిస్ట్రీ విభాగాల్లో తనకు అనుకూలమైన ఇద్దరు కాంట్రాక్టు ప్రొఫెసర్ల గడువు ముగుస్తుండటంతో వారి పదవీ కాలాన్ని పొడిగించినట్లు తెలుస్తోంది.

నల్లమలలో 76 పెద్దపులులు



డీఆర్‌ఓ, ఎఫ్‌బీఓలతో మాట్లాడుతున్న ఎఫ్ఆర్‌ఓ దినేష్‌కుమార్‌రెడ్డి

మహానంది: నంద్యాల జిల్లాలోని నాలుగు డివిజన్లలో సుమారు 76 పెద్దపులులు ఉన్నట్లు నంద్యాల ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ దినేష్‌కుమార్‌రెడ్డి తెలిపారు. మహానందిలోని పర్యావరణ కేంద్రం వద్ద గురువారం నర్సరీ మొక్కలను పరిశీలించిన అనంతరం సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ మేరకు ఎఫ్‌ఆర్‌ఓ దినేష్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ నల్లమలలోని పెద్దపులులు, చిరుత పులులు, అడవి కుక్కల సంతతి గుర్తింపునకు సుమారు 40 కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. వన్యప్రాణుల సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. నల్లమల పరిసర గ్రామాల్లో ఎవరైనా వన్యప్రాణులను వేటాడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అటవీశాఖ అధికారుల అనుమతి లేకుండా అడవుల్లో ప్రవేశించే వారిపై, సంపదను అక్రమంగా రవాణా చేసేవారిపై నిరంతర నిఘా ఉంచామన్నారు. ఆయన వెంట డీఆర్‌ఓ హైమావతి, ఎఫ్‌బీఓలు ప్రతాప్, శ్రీనివాసులు, పీడబ్ల్యూ నాగముని ఉన్నారు.

సాధికారం.. సాకారం

- బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పెద్దపీట
- నామినేటెడ్ పోస్టులతో పాటు నామినేషన్ పనుల్లోనూ ప్రాధాన్యం
- పదవులు ఇచ్చి గౌరవించిన సీఎం వైఎస్ జగన్
- నేడు ఆత్మకూరులో సామాజిక సాధికార యాత్ర
- విజయవంతం చేయాలని ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి పిలుపు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తన సాహసోపేత నిర్ణయాలతో సామాజిక చైతన్యాన్ని తీసుకొచ్చారు. అట్టడుగు వర్గాల ప్రజలకు పదవులు ఇచ్చి సమాజంలో వారికి గౌరవాన్ని పెంచారు. అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తూ వారి అభ్యున్నతికి తోడ్పాటును అందించారు. సాధికారతను సాకారం చేసి బడుగు, బలహీన వర్గాల ప్రజల జీవితాల్లో సరికొత్త వెలుగులు నింపారు. చేసిన మేలును వివరించేందుకు శుక్రవారం ఆత్మకూరు పట్టణంలో సామాజిక సాధికార యాత్ర నిర్వహిస్తున్నారు. మంత్రులతోపాటు ప్రజాప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు.



బహిరంగ సభ నిర్వహించే ఆత్మకూరులోని గౌడ్‌సెంటర్

సాక్షి, నంద్యాల/ఆత్మకూరు: బడుగు, బలహీన వర్గాల ప్రజల సంక్షేమానికి, అభివృద్ధికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పెద్దపీట వేసింది. రాష్ట్రంలో 139 కులాలకు 56 కార్పొరేషన్లు ఏర్పాటు చేసి ఆయా వర్గాల వారికి పదవులు ఇచ్చింది. నామినేటెడ్ పోస్టుల్లో 50 శాతం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకే ఇచ్చింది. ఆయా వర్గాలు అభివృద్ధిలోకి వచ్చేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి .. రాజకీయ, సామాజిక, ఆర్థిక, విద్య, వైద్యం వంటి రంగాల్లో హద్దులు లేకుండా అవకాశాలు కల్పించారు. దీంతో అట్టడుగు వర్గాల వారు నేడు సమాజంలో గౌరవంగా తలెత్తుకుని జీవిస్తున్నారు.

సామాజిక న్యాయం

వైఎస్సార్‌సీపీలో అన్ని వర్గాల వారికి పదవులు వచ్చాయి. బీసీ డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పక్కాగా అమలు చేశారు. మంత్రి వర్గం మొదలుకొని ఎంపీటీసీ పదవుల వరకు అన్నింటిలోనూ అణగారిన వర్గాల వారికి పెద్దపీట వేసి, సమాజంలో ప్రత్యేక గుర్తింపు కల్పించారు. అగ్రవర్ణాలతో సమానంగా ఎదిగేందుకు ఎన్నో అవకాశాలు కల్పించారు. సామాజిక న్యాయాన్ని పాటించి ప్రజల మనస్సులో చెరగని ముద్ర వేశారు.

నాలుగున్నరేళ్ల పాలనలో రూ. వెయ్యికోట్ల పైనే లబ్ధి

సామాజిక సమరశంఖం పూరించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలతో బడుగు, బలహీన వర్గాల ప్రజల జీవితాలు బాగుపడతాయని బలంగా నమ్మారు. ప్రజలంతా ఆర్థికంగా అభివృద్ధి చెందాలనే లక్ష్యంతో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి ఒక్క రూపాయి అవినీతికి తావివ్వకుండా నేరుగా ప్రజలకే చెందేలా చేస్తున్నారు. నాలుగున్నరేళ్ల కాలంలో వివిధ పథకాల ద్వారా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు ప్రత్యక్ష నగదు బదిలీ ద్వారా రూ.769 కోట్ల మేర పంపిణీ చేశారు. పరోక్షంగా మరో రూ.284 కోట్ల మేర లబ్ధి చేకూర్చారు. వీటితో పాటు ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో మౌలిక సదుపాయాలకు కోట్లాది రూపాయలను ఖర్చు చేస్తున్నారు.

యాత్ర సాగనుందిలా....

- శుక్రవారం మధ్యాహ్నం 12 గంటలకు వైఎస్సార్ స్మృతివనంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలతో చర్చా వేదిక నిర్వహిస్తారు.
- మధ్యాహ్నం ఒంటి గంటకు విలేకరుల సమావేశం ఉంటుంది.
- భోజన విరామం తర్వాత వైఎస్సార్ స్మృతి వనం నుంచి ఆత్మకూరుకు ర్యాలీగా బస్సు యాత్ర బయలుదేరుతుంది.
- ఆత్మకూరు పట్టణంలోని నంద్యాల టర్నింగ్ వద్దనున్న వైఎస్సార్ విగ్రహానికి నివాళులు అర్పిస్తారు.
- సాయంత్రం 4 గంటలకు ఆత్మకూరు పట్టణంలోని గౌడ్ సెంటర్‌లో బహిరంగ సభ జరగనుంది.
- యాత్ర సందర్భంగా మంత్రులు, అధికారులు, ప్రజాప్రతినిధుల ప్రసంగాలు వీక్షించేందుకు వీలుగా గౌడ్ సెంటర్‌లో ఎల్ఈడీ స్క్రీన్లను ఏర్పాటు చేస్తున్నారు.

బలహీనులను గుండెల్లో పెట్టుకున్నారు



రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి ప్రాధాన్యత ఇచ్చారు. అందులో భాగంగానే నాకు రాష్ట్ర షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ పదవి దక్కింది. గతంలో టీడీపీ పాలనలో కార్పొరేషన్ ఉన్నప్పటికీ ఏ వర్గానికి ప్రాధాన్యత ఇవ్వలేదు. వైఎస్సార్‌సీపీ పాలనలోనే అన్ని వర్గాలకు సమన్యాయం జరుగుతోంది. అన్ని వర్గాల ప్రజలు అభివృద్ధి సాధిస్తున్నారు.

– అంజాద్‌అలీ, రాష్ట్ర షేక్ కార్పొరేషన్ డైరెక్టర్, ఆత్మకూరు

నియోజకవర్గంలో ప్రత్యక్ష నగదు బదిలీ ద్వారా ఆయా వర్గాల వారు పొందిన లబ్ధి

సామాజిక వర్గం	లబ్ధిదారులు	పొందిన లబ్ధి (రూ.ల్లో)
బీసీ	65,409	503,69,22,423
ఎస్సీ	24,587	186,06,38,271
ఎస్టీ	5,867	43,35,12,822
మైనారిటీ	4,739	36,05,88,553
పరోక్ష నగదు బదిలీ ద్వారా పొందిన లబ్ధి (రూ.ల్లో)		
బీసీ	68,698	191,01,06,728
ఎస్సీ	27,305	64,13,38,019
ఎస్టీ	6,669	17,47,35,194
మైనారిటీ	4,913	11,74,70,400

యాత్రను విజయవంతం చేయండి



బడుగు, బలహీన వర్గాల వారికి పదవులు ఇచ్చి వైఎస్సార్‌సీపీ సముచిత స్థానం కల్పించింది. టీడీపీ ఆయా వర్గాలకు ఎన్నికల ముందు కొన్ని తాయిలాలు ప్రకటించి ఓటు బ్యాంకు రాజకీయాలు చేసింది. వెనుకబడిన వర్గాల ప్రజలందరూ వైఎస్సార్‌సీపీకి మద్దతుగా నిలవాలి. భారీగా తరలివచ్చి సామాజిక సాధికార బస్సుయాత్రను విజయవంతం చేయాలి. వైఎస్సార్‌సీపీ పాలనకు, గత టీడీపీ పాలనకు ఉన్న వ్యత్యాసాన్ని గమనించండి. మంచి చేసే వారి పక్షాన నిలవండి.

– ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి

వైఎస్సార్‌సీపీ పాలనలోనే సామాజిక న్యాయం



రాష్ట్రంలో అన్ని వర్గాలకు వైఎస్సార్‌సీపీ పాలనలోనే న్యాయం జరిగింది. బీసీల పార్టీ అని చెప్పుకునే టీడీపీ ఏనాడు బీసీలకు అండగా నిలిచింది లేదు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను ఓటు బ్యాంకుగానే టీడీపీ చూసింది. సీఎం జగన్ మహిళలకు అన్ని రంగాల్లో 50 శాతం రిజర్వేషన్ అమలు చేస్తున్నారు.

– టంగుటూరి గౌరీదేవి, మేదరి కార్పొరేషన్ డైరెక్టర్, మహానంది



కృష్ణా జలాల నుంచి బయల్పడుతున్న సంగమేశ్వరాలయం

బయల్పడుతున్న సంగమేశ్వరాలయం



ఆలయ అంతర్భాగం

కొత్తపల్లి: శ్రీశైలం జలాశయంలో నీటిమట్టం క్రమేపీ తగ్గుముఖం పడుతోంది. దీంతో జలాశయం నీటిమట్టం గురువారం 885 అడుగుల నుంచి 839 అడుగులకు చేరుకుంది. దీంతో ప్రాచీన సంగమేశ్వరాలయం మరో రెండు అడుగుల్లో పూర్తిగా కృష్ణా జలాల నుంచి బయల్పడనుంది. ఇప్పటికే భక్తులు, అయ్యప్ప స్వాములు ఆలయ ప్రాకారంలో మోకాలి లోతు నీటిలోనే వెళ్లి పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

29న జిల్లాకు సీఎం వైఎస్ జగన్

- స్థలాలను పరిశీలించిన ఎస్పీ

కల్లూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 29న కర్నూలు జిల్లాకు రానున్నారు. పాణ్యం నియోజవర్గంలో జగనన్న విద్యాదీవెన పథకాన్ని ప్రారంభించనున్నారు. సీఎం పర్యటన కోసం గురువారం జిల్లా ఎస్పీ జి. కృష్ణకాంత్ , జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య, మున్సిపల్ కమిషనర్ భార్గవ్ తేజ ఓర్వకల్లు మండలం నన్నూరు, కల్లూరు మండలం లక్ష్మీపురం గ్రామాల్లో స్థలాలను పరిశీలించారు. హెలిపాడ్, సభాస్థలం, పార్కింగ్ ప్రదేశాలు, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ తదితర అంశాలపై చర్చించారు. అన్ని శాఖల అధికారులు సంయుక్తంగా పనిచేసి సీఎం పర్యటనను విజయవంతం చేయాలని కర్నూలు ఎస్పీ జి.కృష్ణకాంత్, జాయింట్ కలెక్టర్ మౌర్య పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ హరిప్రసాద్, కర్నూలు డీఎస్పీ విజయ శేఖర్, స్పెషల్ బ్రాంచ్ సీఐలు ప్రసాద్, శ్రీనివాసరెడ్డి, నాగరాజు యాదవ్, కర్నూలు రూరల్ సర్కిల్ సీఐ కిరణ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.



సీఎం పర్యటనకు లక్ష్మీపురం సమీపంలో స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ కృష్ణకాంత్, జేసీ మౌర్య

నీకున్నదే 40 ఎకరాలు.. 785 ఎకరాలు ఎలా పంచుతావు?

డోన్ టౌన్: నియోజకవర్గంలో బియ్యం కార్డు ఉన్న 31,500 కుటుంబాలకు ఒకటిన్నర సెంటు చొప్పున ఇంటి నివేశన స్థలాలు ఇవ్వాలంటే 785 ఎకరాలు అవసరం. నీకున్నది 40 ఎకరాలు. మరి ఆ హామీని ఎలా నెరవేరుస్తావని మాజీ మంత్రి కేఈ ప్రభాకర్.. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ధర్మవరం సుబ్బారెడ్డిని ప్రశ్నించారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మాయ మాటలు, ఆచరణ సాధ్యం కాని హామీలతో ప్రజలను మభ్యపెడితే ఊరుకునేది లేదన్నారు. ఇంటి పట్టాల హామీ నీ వ్యక్తిగతమా, లేక పార్టీ నిర్ణయమా? అనేది ప్రజలకు తెలియజేయాలన్నారు. టీడీపీ టిక్కెట్ కేఈ కుటుంబానికి కాకుండా ఇతరులకు దక్కే ప్రసక్తే లేదన్నారు. ఈ విషయంలో ఎవరైనా పోటీకి వస్తే అంతు చూడటానికైనా వెనుకాడబోమని హెచ్చరించారు. ఇప్పటి వరకు ఎన్ని సర్వేలు నిర్వహించినా ధర్మవరం గెలవడనే వెల్లడైందన్నారు. సుబ్బారెడ్డి తమ అనుచరులందరినీ ఒక పథకం ప్రకారం అణగదొక్కాడని ఆరోపించారు. దివంగత కోట్ల విజయభాస్కర్‌రెడ్డి నీలాంటి వారిని దూరంగా ఉంచాలనే తలంపుతోనే అక్రమ నాటుసారా వ్యాపారం చేస్తుండటంతో టాడా కేసుతో బేడీలు వేయించడం ఇక్కడి ప్రజలు మర్చిపోలేదని ధర్మవరంను ఉద్దేశించి అన్నారు. ఏడాది కాలంలో నియోజకర్గంలో పార్టీ అభివృద్ధికి రూ.కోటి ఖర్చు చేసినట్లు గొప్పలు చేప్పుకుంటున్న ధర్మవరం 30 ఏళ్లుగా పార్టీ బలోపేతానికి కేఈ కేఈ కుటుంబం ఎంత ఖర్చు చేసి ఉంటుందో తెలుసుకోవాలన్నారు. డోన్ నుంచి వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తాను బరిలో ఉండటం ఖాయమని కేఈ ప్రభాకర్ తేల్చిచెప్పారు.



మాట్లాడుతున్న మాజీ మంత్రి కేఈ ప్రభాకర్

బీసీ ఏం పుడంగి కాదు

బనగానపల్లె టీడీపీ ఇన్‌చార్జ్ బీసీ జనార్దన్‌రెడ్డి ఇతర నియోజకవర్గాల్లో జోక్యం చేసుకుంటున్నాడని, ఆయనేమీ పుడంగి కాదని కేఈ ప్రభాకర్ ఘాటుగా స్పందించారు. డోన్ నుంచి పోటీ చేస్తానని చెప్పుకుంటున్న ధర్మవరం సుబ్బారెడ్డి ఎన్నికల వ్యయాన్నంతటినీ తానే భరిస్తానని బీసీ హామీ ఇచ్చినట్లు జరుగుతున్న ప్రచారంపై మాట్లాడుతూ అడ్డదారిలో సంపాదించిన సొమ్మని ఆరోపించారు. మొదట ఇంట గెలిచి రచ్చ గెలవాలని చురకలంటించారు.

పేదింటి ఆడబిడ్డలకు ఆర్థిక భరోసా

- జిల్లాలో 428 మంది జంటలకు రూ.3.59 కోట్ల లబ్ధి
- జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్



వైఎస్సార్ కల్యాణమస్తు, వైఎస్సార్ షాదీ తోఫా ముగా చెక్కును లబ్ధిదారులకు అందిస్తున్న దృశ్యం

నంద్యాల: వైఎస్సార్ కల్యాణమస్తు, వైఎస్సార్ షాదీ తోఫా పథకాల కింద పేదింటి ఆడబిడ్డలకు ఆర్థిక భరోసా లభిస్తోందని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ తెలిపారు. గురువారం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బటన్ నొక్కి వైఎస్సార్ కల్యాణమస్తు/వైఎస్సార్ షాదీ తోఫా కింద జులై–సెప్టెంబర్ 2003 త్రైమాసికంలో వివాహం చేసుకున్న 10,511 మంది అర్హులైన జంటలకు రూ.81.64 కోట్ల ఆర్థిక సహాయాన్ని బ్యాంక్ ఖాతాల్లో జమ చేశారు. నంద్యాల కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి ఈ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్, జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా, ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిశోర్‌రెడ్డి, లబ్ధిదారులు వీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. నంద్యాల జిల్లాలో నాల్గవ విడతలో అర్హులైన 428 మంది జంటలకు రూ.3.59 కోట్లు జమ చేశారన్నారు. జిల్లాలో గత మూడు విడతలలో 1,674 మంది లబ్ధిదారులకు రూ.13,92,00,000 జమ చేశారన్నారు. జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్ బాషా మాట్లాడుతూ.. ప్రభుత్వం పేదల పెళ్లిళ్లకు ఆర్థిక సాయం అందించడం గొప్ప విషయం అన్నారు. ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి.. వైఎస్సార్ కల్యాణమస్తు వైఎస్సార్ షాది తోఫాల కింద పేద జంటలకు ఆర్థిక సహాయాన్ని అందిస్తున్నారన్నారు. అనంతరం లబ్ధిదారులకు మెగా చెక్కును అందజేశారు. వీడియో కాన్ఫరెన్స్‌లో మున్సిపల్ చైర్ పర్సన్ మాబున్నీసా, మైనార్టీ సలహాదారుడు హబీబుల్లా, ఏపీఎస్పీడీసీఎల్ డైరెక్టర్ శశికళారెడ్డి, రాష్ట్ర హస్త కళల డైరెక్టర్ సునీత అమృతరాజ్, డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్ రెడ్డి, సంక్షేమ శాఖ డీడీ చింతామణి, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గం	లబ్ధిదారులు	అందిన మొత్తం (రూ.ల్లో)
ఆళ్లగడ్డ	71	63,20,000
బనగానపల్లె	80	66,40,000
నందికొట్కూర్	61	53,00,000
డోన్	61	46,50,000
నంద్యాల	67	58,80,000
పాణ్యం	26	19,45,000
శ్రీశైలం	62	51,75,000

జర్నలిస్టుల ఇళ్ల స్థలాలకు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్

కర్నూలు(సెంట్రల్): అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు జిల్లా సమాచార, పౌరసంబంధాల శాఖ డెప్యూటీ డైరక్టర్ జయమ్మ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. అర్హులైన జర్నలిస్టులు నవంబర్ 23 నుంచి జనవరి 6వ తేదీలోపు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. జీఓ 535 నిబంధనలు ప్రకారం అర్హులైన వారికి ప్లాట్లను కేటాయించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. www.ipr.ap.gov.inను సందర్శించి ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఆమె పేర్కొన్నారు.

ఎంతో మేలు జరిగింది



రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో మా కుటుంబానికి ఎంతో మేలు జరిగింది. రైతు భరోసా పథకం ద్వారా ఐదో విడతల్లో ఇప్పటి వరకు రూ. 65,500 వచ్చింది. వైఎస్సార్ చేయూత పథకం కింద మూడు విడతల్లో 56,250, అమ్మఒడి పథకం ద్వారా నాలుగు విడతల్లో రూ. 55 వేలు, వైఎస్సార్ సున్నా వడ్డీ(రైతులకు సంబంధించి) రూ. 12వేలు, వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా రూ. 16వేలు చొప్పున నగదు జమ అయ్యింది. నాలుగున్నర సంవత్సరాల్లో మా కుటుంబానికి రూ. 2 లక్షల మేర లబ్ధి చేకూరింది. రూ. 55వేలతో గేదెను కొనుగోలు చేసి చిన్నపాటి పాడిపరిశ్రమ నిర్వహించుకుంటున్నాం. పెద్దకుమారుడు మధు ఎమ్మెస్సీ పూర్తి చేసి ఆత్మకూరు పట్టణంలో ఓ ఫెర్టిలైజ్డ్స్ దుకాణంలో పనిచేస్తూ ప్రభుత్వ ఉద్యోగం కోసం ప్రయత్నిస్తున్నాడు. చిన్నకుమారుడు మనోజ్ ఓర్వకల్లు మండలం కాల్వబుగ్గ ఏపీ రెసిడెన్సియల్ స్కూల్‌లో 8వ తరగతి చదువుతున్నాడు.

– తిరుపతయ్య, వల్లంపాడు గ్రామం, కోవెలకుంట్ల మండలం



సొంతింటి కల నెరవేరుతోంది



జగనన్న సీఎం అయితే పేదలకు న్యాయం జరుగుతుంది అనుకున్నాం. అనుకున్నట్టే జరిగింది. ఇచ్చిన మాటకు కట్టుబడి పేదలందరికీ ఇంటి స్థలాలు ఇచ్చారు. ఇళ్లు కూడా మంజూరు చేసి సొంతింటి కలను నెరవేరుస్తున్నారు. మాది పేద కుటుంబం. నా భర్త దుస్తుల వ్యాపారం చేస్తున్నారు. నేను కూలి పనులు చేస్తున్నా. మాకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. అద్దె ఇంట్లో ఉంటున్నాం. గతంలో ఇంటి మంజూరు కోసం ఎన్నో సార్లు దరఖాస్తు చేసుకున్నాం. అయినా ఎవరూ పట్టించుకోలేదు. జగనన్న ముఖ్యమంత్రి అయ్యాక వలంటీర్ ఇంటి దగ్గరికి వచ్చి వివరాలు తీసుకున్నారు. మాకు ఇల్లు మంజూరు చేయించారు. ఇప్పుడు మేం ఇల్లు కట్టుకుంటున్నాం. పనులు పూర్తి కావచ్చాయి. సొంతింటి కల నేరవేరుతున్నందుకు చాలా సంతోషంగా ఉంది. మా కలను నేరవేరుస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటాం.

– రాధ, సంజామల

క్లుప్తంగా

యువకుడి ఆత్మహత్య



మృతి చెందిన ఉప్పరి రవికుమార్

కృష్ణగిరి: పుట్లూరు గ్రామానికి చెందిన ఉప్పరి రవికుమార్ (22) పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్‌ఐ సురేష్ తెలిపిన వివరాల మేరకు..గ్రామానికి చెందిన ఉప్పరి నడిపి రాముడికి కుమారుడు రవికుమార్, కుమార్తె ఉన్నారు. ఆరేళ్ల వయస్సులో రవికుమార్ కరెంటు స్తంభం నుంచి కింద పడటంతో మతిస్థిమితం కోల్పోయాడు. ఈ క్రమంలోనే యువకుడి సోదరి ప్రేమ వివాహం చేసుకుంది. దీంతో మనస్తాపం చెందిన యువకుడు బుధవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో మద్యంలో పురుగు మందు కలుపుకుని తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే వెల్దుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కర్నూలు సర్వజన వైద్యశాలకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక గురువారం మృతి చెందినట్లు ఎస్‌ఐ తెలిపారు. కుమారుడి ఆత్మహత్యతో కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

అగ్ని ప్రమాదంలో గాయపడిన మహిళ మృతి



మృతిచెందిన లక్ష్మి (ఫైల్)

ఆలూరు రూరల్: వంట గ్యాస్ లీకై జరిగిన అగ్ని ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మహిళ చికిత్స పొందుతూ మృతి చెందింది. కురువళ్లి గ్రామానికి చెందిన లక్ష్మి(30) గత శనివారం సాయంత్రం వంట చేస్తుండగా గ్యాస్ లీకై చీరకు నిప్పంటుకుని తీవ్రంగా గాయపడింది. శరీరమంతా 80 శాతం కాలిపోవడంతో మెరుగైన చికిత్స కోసం అంబులెన్స్‌లో బళ్లారి ప్రభుత్వ ఆస్పత్రికి రెఫర్ చేశారు. ఐదు రోజులుగా అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. మృతురాలికి భర్త సురేష్, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

కర్నూలు: కర్నూలు మండలం మిలిటరీ కాలనీ సమీపంలోని నగర వనం చెరువు సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కృష్ణగిరి మండలం పుట్లూరు గ్రామానికి చెందిన శ్రీనివాసులు కుమారుడు చాకలి విజయ్ కుమార్ (25) అక్కడికక్కడే మృతి చెందాడు. బావమరిది మహేంద్రతో కలసి బ్రాహ్మణకొట్కూరు సమీపంలోని 10–బొల్లవరానికి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా నగరవనం దగ్గర ప్రమాదం చోటు చేసుకుంది. గార్గేయపురం నుంచి కర్నూలుకు పత్తి లోడుతో వస్తున్న ఐచర్ వాహనం ఉదయం 7.30 గంటల సమయంలో ద్విచక్ర వాహనాన్ని ఎదురుగా ఢీకొట్టడంతో విజయ్‌కుమార్ ఎగిరి పడటంతో తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. బైక్ వెనుక కూర్చున్న మహేంద్రకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే ఆయనను చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలిసిన వెంటనే కర్నూలు అర్బన్ తాలూకా పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. ఐచర్ వాహనం డ్రైవర్ అయ్యస్వామి నిర్లక్ష్యం వల్లే ప్రమాదం చోటు చేసుకున్నట్లు గుర్తించి పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ప్రమాదంలో మృతిచెందిన విజయ్‌కుమార్‌కు భార్య నాగమణి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శ్రీరాం తెలిపారు.

విత్తన పత్తికి జైకొట్టారు

- దొర్నిపాడులో అధికంగా సీడ్ పత్తి సాగు
- అనుకూలించిన నేలలు, వర్షాభావ పరిస్థితులు
- రైతులను ప్రోత్సహిస్తున్న దేశవాళి కంపెనీలు
- మూడు నెలల పాటు కూలీలకు ఉపాధి



పత్తిలో క్రాసింగ్ పనులు చేస్తున్న మహిళలు

దొర్నిపాడు: గతంలో విత్తన పత్తి (సీడ్‌పత్తి) సాగుకు నంద్యాల జిల్లా ఎంతో ప్రసిద్ధి. కాగా క్రమేణా సాగునీటి ప్రాజెక్టులు పూర్తియి నీరు అందుబాటులోకి రావడంతో రైతులు వరి, మిర్చి, శనగ సాగు వైపు దృష్టి సారిస్తూ వచ్చారు. అయితే ఈ ఏడాది వర్షాభావ పరిస్థితుల కారణంగా మళ్లీ రైతులు విత్తన పత్తికి జైకొట్టారు. జిల్లాలో 10,411 హెకార్లలో వాణిజ్య, సీడ్ పత్తి సాగు చేయగా అత్యధికంగా దొర్నిపాడు మండలంలో 722 హెక్టార్లలో కేవలం సీడ్ పత్తి సాగు చేశారు. ఇటు రైతులు, అటు కూలీలకు ఈ పంట వరంగా మారిందని చెప్పవచ్చు. కేసీ కెనాల్, కుందూ పరివాహక ప్రాంతాల్లో సాగునీరు లేక పోవడంతో రబీ సీజన్‌లో వరి సాగు విస్తీర్ణం తగ్గిపోయింది. అధికారుల సూచనలు, సలహాల మేరకు ఆరుతడి పంటలు సాగు చేశారు. దొర్నిపాడు మండలంలో నల్లరేగడి భూములు అధికంగా ఉండటం, వర్షాభావ పరిస్థితులు అనుకూలించడంతో సీడ్ పత్తి సాగుకు రైతులు ఆసక్తి చూపారు. ప్రస్తుతం పూత, పింజ దశలో పంట ఉంది. ఎకరాకు 8 –10 క్వింటాళ్ల వరకు విత్తనాలు దిగుబడి వచ్చే అవకాశం ఉందని రైతులు ఆశిస్తున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో క్వింటా విత్తనాలు రూ. 50 వేల నుంచి రూ. 60 వేల వరకు ధర పలుకుతుంది. ఎకరా విత్తన పత్తి సాగుకు రూ. 2.50 లక్షల నుంచి రూ. 3 లక్షల వరకు పెట్టుబడి పోను రైతుకు ఎకరాకు రూ. 2 లక్షల వరకు ఆదాయం వస్తుందని అంచనా వేస్తున్నారు. జిల్లాలో ఆళ్లగడ్డ, ఉయ్యాలవాడ మండలాల్లోను అత్యధికంగా సీడ్ పత్తి సాగు చేస్తారు. ఈ మూడు మండలాల్లో ఉత్పత్తి చేసిన విత్తనాలకు సక్సెస్ రేటు అధికంగా ఉంటుందని ఆయా కంపెనీల ప్రతినిధులు చెబుతున్నారు.

కూలీలకు కొండంత అండ

వర్షాభావ పరిస్థితులతో పంటల సాగు తగ్గిపోయి కూలీలకు వ్యవసాయ పనులు దొరకడం లేదు. ఈ క్రమంలో సీడ్ పత్తి కొండంత అండగా నిలిచింది. కూలీలకు మూడు నెలల పాటు ఉపాధి లభిస్తోంది. జతకు రూ.50 వేలకు పైగా కూలి వస్తుంది. ప్రతి రోజు సీడ్ పత్తి క్రాసింగ్ పనులకు కూలీలు ఎంతో అవసరం. స్థానికంగా కూలీల కొరత రావడంతో ఇతర ప్రాంతాల నుంచి రైతులను తెచ్చుకుంటున్నారు. రూ.300 నుంచి 400 వరకు కూలి ఇస్తుండంతో దూర ప్రాంతాల నుంచి ఆటోల్లో పనులకు వస్తున్నారు.

నాణ్యమైన విత్తనాలు దిగుబడి

మండలంలో విత్తన పత్తిసాగుకు ఇక్కడి నల్లరేగడి నేలలు పూర్తిగా అనుకూలిస్తాయి. ఇక్కడ మేల్, ఫిమేల్ విత్తనాలను క్రాస్ చేయగా వచ్చిన విత్తనాలను పలు కంపెనీలు దేశవ్యాప్తంగా పత్తి సాగుకు సరఫరా చేస్తాయి. క్రాసింగ్ చేసిన పత్తి విత్తనాలనే కమర్షియల్, విత్తన పత్తి సాగుకు ఉపయోగిస్తారు. ఈ పంటను ఏపీలో దొర్నిపాడు, తెలంగాణాలో గద్వాల్ ప్రాంతాల్లో అత్యధికంగా సాగుచేస్తారు. దేశంలో 70 శాతం ఇక్కడ సాగు చేసిన విత్తనాలనే పత్తి సాగుకు ఉపయోగిస్తారు. ఈ నేపథ్యంలో దేశవాళీ కంపెనీలు దొర్నిపాడు, ఆళ్లగడ్డ, ఉయ్యాలవాడ రైతులతో ముందుగానే ఒప్పందం చేసుకుని పెట్టుబడికి ఆర్థిక సహాయం చేస్తున్నాయి. ఐదారు ఎకరాలు సాగు చేసే రైతుకు ముందుగానే రూ. 3 లక్షల వరకు అడ్వాన్స్‌గా ఇస్తున్నాయి. దీంతో రైతులు ధీమాగా సీడ్ పత్తి సాగుకు ముందుకు వస్తున్నారు.

సీజన్‌లో రూ. 30 వేలు సంపాదిస్తా..



సీడ్ పత్తి సాగు చేస్తే కూలీలకు ఉపాధి బాగుంటుంది. ఆడ, మగ మొగ్గల క్రాసింగ్‌కు కూలీలు ఎంతో అవసరం. సకాలంలో క్రాసింగ్ చేయాల్సి రావడంతో కూలీలకు డిమాండ్ ఉంటుంది. నేను 18 ఏళ్లగా సీడు పత్తి పొలాల్లో కూలీగా పని చేస్తున్నాను. ఏటా సీజన్‌లో రూ. 30 వేలు వరకు సంపాదిస్తా.

– అనసూయమ్మ, వ్యవసాయ కూలీ, దొర్నిపాడు

మూడు ఎకరాల్లో సాగు చేశా



నేను ఏటా విత్తన పత్తిని నాగు చేస్తాను. ఈ సారి కూడా మూడు ఎకరాలు కౌలుకు తీసుకున్నా. ప్రస్తుతం పంట కూడా బాగానే ఉంది. ఎకరానికి విత్తనాలు, మందులు, కూలీలు రూపంలో రూ.2లక్షలకు పైగా ఖర్చు వస్తుంది. అయినా ధైర్యం చేసి సాగుచేస్తున్నాను. చాలా జాగ్రత్తలు పాటించి ఎలాంటి నష్టం వాటిల్లకుండా పత్తిని సాగు చేస్తున్నాను. దేవుడు కరుణిస్తే రూ. నాలుగైదు లక్షల ఆదాయం వస్తుందని ఆశిస్తున్నా.

– దస్తగిరి, చాకరాజువేముల

వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలి



నాణ్యమైన విత్తన దిగుబడికి రైతులు తప్పకుండా వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలి. పంట యాజమన్య పద్ధతులు పాటించాలి. సీడ్ పత్తి సాగుకు ఇక్కడి నల్లరేగడి నేలలు అనుకూలంగా ఉండటంతో రైతులు ఈ పంటను అత్యధిక విస్తీర్ణంలో సాగు చేశారు. మిగతా పంటలతో పోల్చితే లాభాలు అధికంగా ఉండే అవకాశం ఉంది.

– సునీత, మండల వ్యవసాయాధికారి, దొర్నిపాడు

అనుకూలించిన వర్షభావ పరిస్థితులు

సీడ్ పత్తి సాగును ఏటా అక్టోబర్‌లో సాగు చేయగా నాలుగు నెలల పాటు కంటికి రెప్పలా కాపాడుకోవాలి. కాగా సీడ్ పత్తి సాగులో క్రాసింగ్ కీలకం. పూత, పింజ దశలో ఏటా భారీ వర్షాలు కురవడంతో నేలరాలి రైతులు నష్టపోయారు. ఒక్కో మొక్కకు 70 నుంచి 80 వరకు కాయలు వస్తాయి. వర్షం కురిస్తే కనీసం 40 నుంచి 50 వరకు మాత్రమే ఉండేవి. ప్రస్తుతం వర్షాభావ పరిస్థితులు ఈ పంటకు అనుకూలంగా మారాయి. ప్రస్తుతం సీడ్ పత్తి మొక్కలు పింజలతో కళకళలాడుతున్నాయి. దిగుబడి పెరిగే అవకాశం ఉంది. అలాగే ఆరుతడి పంటలకు అధికారులు వారంబందీగా సాగునీటిని విడుదల చేస్తుండటంతో రైతులు గట్టెక్కుతున్నారు.



క్రాసింగ్ అనంతరం కవర్లు తొడిగిన దృశ్యం

నలుగురు ఎర్రచందనం కూలీల అరెస్టు



పట్టుబడిన ఎర్రచందనం కూలీలతో ఫారెస్టు అధికారులు, సిబ్బంది

చాగలమర్రి: నంద్యాల, వైఎస్సార్ జిల్లా సరిహద్దు ప్రాంతంలో తమిళనాడుకు చెందిన నలుగురు ఎర్ర చందనం కూలీలు గురువారం పట్టుబడ్డారు. ఫారెస్ట్ రెంజ్ ఆఫీసర్ శ్రీపతి నాయుడు తెలిపిన వివరాల మేరకు.. ముందస్తు సమాచారం మేరకు వైఎస్సార్ జిల్లా సరిహద్దు అటవీ ప్రాంతంలో డి.వనిపెంట సెక్షన్ సిబ్బంది, మొబైల్ పార్టీ, రుద్రవరం రెంజ్ సిబ్బంది సంయుక్తంగా దాడి చేశారు. ఆ సమయంలో తమిళనాడు రాష్ట్రానికి చెందిన సెల్వం, ఇళయరాజాన్ని, చంద్రన్ కంటెన్, పోన్ను స్వామి అడవిలోకి వెళ్తుండగా అదుపులోకి తీసుకున్నారు. నలుగురిని అరెస్టు చేసి రిమాండుకు తరలించినట్లు శ్రీపతినాయుడు తెలిపారు. సమావేశంలో డిప్యూటీ రెంజ్ అధికారులు నాగేంద్రనాయక్, ముర్తుజావలి, ఎఫ్‌ఎస్‌ఓలు శ్రీనివాసులరెడ్డి, ముక్తార్‌బాషా, సిబ్బంది పాల్గొన్నారు.

గురుకుల విద్యార్థినుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

కర్నూలు(అర్బన్): జిల్లాలోని గిరిజన ఆశ్రమ, గురుకులాల్లోని విద్యార్థినుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి ఎస్ శ్రీనివాసకుమార్ ఆదేశించారు. గురువారం సాయంత్రం తన చాంబర్‌లో జిల్లాలోని ఆయా విద్యా సంస్థల ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాళ్లతో సమావేశం నిర్వహించారు. విద్యార్థినులు రక్తహీనత బారిన పడకుండా అవరసమైన మందులు, పౌష్టికాహారాన్ని అందించాలన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు మెనూ తప్పక పాటించాలన్నారు. కార్యాలయ పర్యవేక్షకులు సీమోన్, హెచ్‌ఎం, ప్రిన్సిపాల్స్ లక్ష్మిగుర్రప్ప, అహోబలేసు, జమ్మన్న తదితరులు పాల్గొన్నారు.

బిల్లుల వసూలుపై దృష్టి సారించండి

కర్నూలు(రాజ్‌విహార్): విద్యుత్ బిల్లుల వసూలుపై ఆయా విభాగాల సిబ్బంది తగిన దృష్టి సారించాలని దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కర్నూలు ఆపరేషన్స్ ఎస్‌ఈ ఎం. ఉమాపతి అన్నారు. గురువారం ఆయన కింది స్థాయి అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెలవారి బిల్లులకు సంబంధించిన ఇప్పటికే డిమాండ్ నోటీసుల జారీ ప్రక్రియ పూర్తయినట్లు చెప్పారు. ఉమ్మడి జిల్లాలో 100 శాతం రాబట్టాల్సిన బాధ్యత ఉద్యోగులపై ఉందన్నారు. దీనిపై ఆపరేషన్స్ ఎగ్జిక్యూటీవ్ ఇంజినీర్లు, డిప్యూటి ఎగ్జిక్యూటీవ్ ఇంజినీర్లు, ఏఈలు ప్రత్యేక ప్రణాళిక తయారు చేసుకొని లక్ష్యం చేరాలన్నారు. పాత బిల్లులు, మొండి బకాయిలను ఎలాగైనా రాబట్టాలని, ప్రభుత్వ శాఖలకు సంబంధించి ఎప్పటికప్పుడు ఆయా అధికారులతో మాట్లాడి వసూలు అయ్యేలా చూడాలని సూచించారు.

అన్ని వర్గాల వారికి డీసీసీబీ రుణాలు



మాట్లాడుతున్న డీసీసీబీ చైర్‌పర్సన్ ఎస్వీ విజయమనోహరి

కర్నూలు(అగ్రికల్చర్): అన్ని వర్గాల వారి అభ్యున్నతికి అవసరమైన స్థాయిలో రుణాలు అందిస్తామని ఉమ్మడి కర్నూలు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు చైర్‌పర్సన్ ఎస్వీ విజయమనోహరి తెలిపారు. గురువారం డీసీసీబీ చైర్‌పర్సన్ అధ్యక్షతన ఆమె చాంబర్‌లో బోర్డు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మొదటిసారి డీసీసీబీ శాఖల ద్వారా విద్యార్థులు స్వదేశీ/విదేశీ విద్యను అభ్యసించేందుకు విద్యా రుణాలు పంపిణీ చేయాలని నిర్ణయిస్తూ తీర్మానించామన్నారు. తగిన సెక్యూరిటీ నిబంధనలతో రూ.40 లక్షల వరకు విద్యారుణాలు మంజూరు చేస్తామన్నారు. ఉద్యోగులు, ఉద్యోగేతరులకు, కేడీసీసీ బ్యాంకులో పనిచేస్తున్న ఉద్యోగులకు నూతన గృహాలు/అపార్టుమెంట్‌లలో ఫ్లాట్ కొనుగోలుకు రూ.75 లక్షల వరకు రుణం ఇస్తామన్నారు. ప్రధాన మంత్రి ఎంప్లాయ్‌మెంటు జనరేషన్ పోగ్రాం కింద ఏర్పాటు చేసే యూనిట్లు/పరిశ్రమల వ్యయపరిమితిని తయారీ రంగ పరిశ్రమలైతే ఇది వరకు ఉన్న రుణ పరిమితిని రూ.25 లక్షల నుంచి రూ.50 లక్షలకు పెంచాలని నిర్ణయించామన్నారు. వ్యాపార, సేవా రంగంలో ఏర్పాటు చేసే యూనిట్లకు రుణ పరిమితిని రూ.10 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు పెంచినట్లు తెలిపారు. కేడీసీసీ బ్యాంకులో సర్వీస్‌లోని ఉద్యోగులకు ప్రస్తుతం ఉన్న వ్యక్తిగత రుణ పథకానికి బదులు క్యాష్ క్రెడిట్ ఓవర్ డ్రాఫ్టు ఫెసిలిటీతో రూ.20 లక్షల వరకు రుణ సదుపాయాన్ని కల్పిస్తామన్నారు. బోర్డు సమావేశంలో సీఈవో పి.రామాంజనేయులు, డైరెక్టర్లు గుండం సూర్యప్రకాశ్‌రెడ్డి, నాసరి వెంకటేశ్వర్లు, కె.వెంకటరమణారెడ్డి, వెంకటేశ్వరమ్మ, సీమ సుధాకర్‌రెడ్డి, మూలింటి రాఘవేంద్ర, ప్రభుత్వ నామినీ డీసీవో ఎస్.రామాంజనేయులు, ఆప్కాబ్ డీజీఎం దినేష్‌కుమార్, నాబార్డు డీడీఎం సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జ్ బిషప్‌గా ఐజక్ వరప్రసాద్



బిషప్‌ను ఐజక్ వరప్రసాద్ అభినందిస్తున్న క్రైస్తవ సభ్యులు

నంద్యాల(న్యూటౌన్): నంద్యాల డయాసిస్ ఇన్‌చార్జ్ బిషప్‌గా ఐజక్ వరప్రసాద్ నియమితులైనట్లు పదవీ విరమణ పొందిన నంద్యాల డయాసిస్ బిషప్ ఎగ్గొని పుష్పలలితమ్మ గురువారం విలేకరులకు తెలిపారు. నంద్యాల పట్టణంలోని బిషప్ కార్యాయలంలో ఐజక్ వరప్రసాద్ నూతనంగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశానికి డయాసిస్ పరిధిలోని అన్ని పాస్టరేట్ల చైర్మన్లు, సెక్రటరీలు, కమిటీ మెంబర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నంద్యాల డయాసిస్ పరిధిలో ఉన్న అన్ని పాస్టరేట్ల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. పాస్టరేట్–1 డీనరీ చైర్మన్ ఇమ్మానియేల్, సెక్రటరీ కిరణ్‌కుమార్, పాస్టరేట్–2 డీనరీ చైర్మన్ జోసెఫ్ బాబు, సెక్రటరీ, ప్రభుదాసు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి జిమ్నాస్టిక్స్‌లో కర్నూలుకు పతకాలు



పతకాలు సాధించిన జిమ్నాస్టిక్స్ క్రీడాకారులను అభినందిస్తున్న సీఈఓ రమణ

కర్నూలు (టౌన్): కాకినాడ పట్టణంలో ఈ నెల 3, 4 తేదీల్లో నిర్వహించిన రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ జిమ్నాస్టిక్స్ పోటీల్లో కర్నూలు క్రీడాకారులు పతకాలు సాధించారు. అండర్–14 విభాగంలో రిథమిక్ జిమ్నాస్టిక్స్ బాల్, రిబ్బన్ విభాగంలో బి.సహస్ర బంగారు, వెండి, ఇదే విభాగంలో వినీల కాంస్య పతకం సాధించారు. అలాగే అండర్–17 విభాగంలో అన్ ఈవన్ బార్ విభాగంలో టి.జీవికా రెడ్డి కాంస్య పతకం, అలాగే అండర్–17 హారిజంటల్ బార్ విభాగంలో జె.సాయి అభిరాం కాంస్య పతకం సాధించారు. వీరంతా ఢిల్లీలో నిర్వహించనున్న జాతీయస్థాయి జిమ్నాస్టిక్స్ పోటీల్లో పాల్గొంటున్నట్లు స్పోర్ట్స్ అథారిటీ జిమ్నాస్టిక్స్ కోచ్ తోట పవన్‌కుమార్ వెల్లడించారు. పతకాలు సాధించిన క్రీడాకారులను గురువారం సాయంత్రం స్పోర్ట్స్ అథారిటీ అవుట్‌డోర్ స్టేడియంలో సీఈఓ రమణ అభినందించారు.

నవోదయలో 3న పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని బనవాసి జవహర్ నవోదయ విద్యాలయంలో వచ్చే నెల 3వ తేదీన పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించనున్నట్లు విద్యాలయ ప్రిన్సిపాల్ ఇ.పద్మావతి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రతి సంవత్సరం డిసెంబర్ నెలలో పూర్వపు విద్యార్థుల సమ్మేళనం నిర్వహిస్తున్నారని, ఈ సారి కూడా నిర్వహించనున్నట్లు చెప్పారు. పూర్వపు విద్యార్థుల సమ్మేళన ఆహ్వాన పత్రాలను వారి ఈ–మెయిల్స్‌కు పంపినట్లు పేర్కొన్నారు.

క్రీడల్లో రాణిస్తే ప్రత్యేక గుర్తింపు

- డీఈఓ రంగారెడ్డి
- అట్టహాసంగా రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ వెయిట్ లిఫ్టింగ్ పోటీలు



లిఫ్ట్ చేస్తు పోటీలను ప్రారంభిస్తున్న డీఈఓ, క్రీడా అధికారులు

కర్నూలు (టౌన్): క్రీడల్లో రాణిస్తే ప్రత్యేక గుర్తింపుతోపాటు విద్యా, ఉద్యోగ అవకాశాలు మెరుగుపడతాయని జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ రంగారెడ్డి అన్నారు. గురువారం నగర శివారులోని మిలటరీ కాలనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన 67వ రాష్ట్ర స్థాయి వెయిట్ లిఫ్టింగ్ అండర్–17 పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను ప్రారంభించిన డీఈఓ మాట్లాడుతూ ప్రతి రోజు కొంత సమయం క్రీడా సాధనకు కేటాయించాలన్నారు. క్రీడల్లో పాల్గొనే క్రీడాకారుల్లో మానసిక వికాసంతో పాటు నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయన్నారు. వైసీపీ నాయకులు లోకేశ్వర రెడ్డి, ఎల్లమ్మ దేవస్థానం చైర్మన్ క్రిష్ణుడు మాట్లాడుతూ ప్రభుత్వం క్రీడారంగానికి ఎంతో ప్రాధాన్యత ఇస్తుందన్నారు. క్రీడాకారులకు ఉచిత భోజన వసతి, క్రీడా దుస్తులు, రవాణా చార్జీలు సైతం సమకూర్చడం శుభపరిణామమన్నారు. పోటీల సందర్భంగా మిలటరీ కాలనీ, గార్గేయపురం పాఠశాలల విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి జోసఫ్ లక్ష్మయ్య, రాష్ట్ర పరిశీలకులు నాగ శిరీషా, వ్యాయామ ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, ఎండీ బాషా పాల్గొన్నారు.

అట్టహాసంగా క్రికెట్ పోటీలు ప్రారంభం



క్రికెట్ ఆడుతున్న క్రీడాకారులు

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని ఎస్పీజీ క్రీడా మైదానంలో కర్నూలు ఉమ్మడి జిల్లాల అండర్–14 క్రికెట్ బాలుర పోటీలు గురువారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈ పోటీల్లో పాల్గొనేందుకు 200 మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఈ పోటీల్లో ప్రతిభ చాటిన 50 మందిని ఎంపిక చేశామని ఎస్‌జీఎఫ్ సెక్రటరీ శివకుమార్ తెలిపారు. 50 మందికి నాలుగు రోజుల పాటు ప్రత్యేక శిక్షణ ఇచ్చి ఉమ్మడి జిల్లా జట్టును ఎంపిక చేస్తామన్నారు. క్రీడాకారులకు ఎస్‌డీఆర్ విద్యాసంస్థల అధినేత కొండారెడ్డి భోజన వసతితో పాటు నంద్యాల జిల్లా క్రికెట్ టీంకు క్రీడాదుస్తులు అందజేశారు. క్రీడా నైపుణ్యంతో క్రికెట్ పోటీల్లో క్రీడాకారులు ప్రదర్శించాలన్నారు. గెలుపు ఓటములు సమానంగా తీసుకోవాలన్నారు. సదుపాయాలు కల్పించిన ఎస్‌డీఆర్ స్కూల్ అధినేతను అభినందించారు. కార్యక్రమంలో స్కూల్ గేమ్ ఫెడరేషన్ సెక్రటరీ సల్మాన్, దాసు, తదితరులు పాల్గొన్నారు.

50 శాతం డిస్కౌంట్‌తో మాధవరం సిల్క్, కాటన్ చీరల అమ్మకం

కర్నూలు(అగ్రికల్చర్): చేనేత వస్త్రాలకు మార్కెటింగ్ కల్పించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు ఆప్కో డివిజినల్ మార్కెటింగ్ అధికారి బి.భారతి తెలిపారు. అన్ని వర్గాల ప్రజలు చేనేత వస్త్రాలు కొనుగోలు చేసేలా నెల వారీ పొదుపు పథకం, చేనేత వస్త్రాల కొనుగోలుకు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు 5 సులభ వాయిదాల్లో తిరిగి చెల్లించేందుకు వడ్డీ లేని సదుపాయాన్ని కల్పిస్తోందన్నారు. గురువారం అబ్దుల్లాఖాన్ ఎస్టేట్‌లోని తుంగభద్ర ఆప్కో మెగా షోరూంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. 50 శాతం డిస్కౌంట్‌తో ఎంపిక చేసిన మాధవరం సిల్క్, కాటన్ చీరలు అమ్మకాలు మొదలయ్యాయన్నారు. నెలకు రూ.1000 ప్రకారం 11 నెలలు చెల్లిస్తే రూ.11,000 అవుతుందని, దీనికి ఆప్కో రూ.1000 కలుపుతుందని.. మొత్తంగా రూ.15,560 విలువ చేనేత వస్త్రాలు కొనుగోలు చేయవచ్చన్నారు. రూ.500 నుంచి రూ.6వేల వరకు పొదుపు చేసి చేనేత వస్త్రాలు పొందవచ్చన్నారు. నాన్ గజిటెడ్ అధికారులు రూ.25వేలు, గజిటెడ్ అధికారులు రూ.50వేల విలువ చేనేత వస్త్రాలు ముందస్తుగా కొనుగోలు చేయవచ్చని, మరుసటి నెల నుంచి 5 నెలల్లో చెల్లించే వీలుందన్నారు. ఇందుకు ఉద్యోగులు మార్గదర్శకాలు పాటించాల్సి ఉంటుందని తెలిపారు. వివరాలకు 82473 57666 నెంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.

కానిస్టేబుల్ కుటుంబానికి చేయూత



కానిస్టేబుల్ కుటుంబానికి ఎస్పీ చేతుల మీదుగా ఆర్థిక సహాయం అందజేస్తున్న సహోద్యోగులు

కర్నూలు: కర్నూలు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో పని చేస్తూ ఈనెల 9వ తేదీన అనారోగ్యంతో మృతి చెందిన కానిస్టేబుల్ తిరుమలేశ్వర రెడ్డి కుటుంబానికి సహోద్యోగులు చేయూతనిచ్చారు. ఈయనకు ఒక కుమార్తె ఉన్నారు. తోటి కానిస్టేబుల్ కుటుంబానికి ఆర్థిక సహాయం అందించి అండగా నిలిచేందుకు 2000 బ్యాచ్‌కు చెందిన కర్నూలు, చిత్తూరు ఉమ్మడి జిల్లాల పోలీసులు తమ వంతు సహాయంగా రూ.3.40 లక్షల నగదును సేకరించారు. ఈ మొత్తాన్ని గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ కృష్ణకాంత్ చేతుల మీదుగా కానిస్టేబుల్ కుమార్తె ఎం.దీపిక, తల్లి కోటమ్మలకు అందజేశారు.

పీఆర్ క్యూసీ పేరు మార్పు

- రిపోర్టులు ఈఎన్‌సీ పరిధి నుంచి నేరుగా ప్రభుత్వానికి

కర్నూలు(అర్బన్): పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖ పరిధిలోని విజిలెన్స్ అండ్ క్వాలిటీ కంట్రోల్ వింగ్ పేరును క్వాలిటీ అస్యూరెన్స్ అండ్ క్వాలిటీ కంట్రోల్‌గా మారుస్తు పీఆర్‌అండ్‌ఆర్‌డీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ బీ రాజశేఖర్ ఉత్తర్వులు జారీ చేసినట్లు పీఆర్ క్యూసీ డీఈఈ రవీంద్రారెడ్డి తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ చేస్తున్న పనుల్లో మరింత నాణ్యతను పెంచేందుకు ప్రభుత్వం ఈ విభాగాన్ని పటిష్టం చేస్తోందన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇప్పటి వరకు జిల్లాలో జరుగుతున్న వివిధ రకాల పనులను క్వాలిటీ కంట్రోల్ విభాగం ఇంజినీర్లు పరీక్షించి రిపోర్టులను పీఆర్ ఈఎన్‌సీకి పంపేవారమన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ప్రకారం ఆయా రిపోర్టులను పీఆర్ చీఫ్ ఇంజినీరు ద్వారా నేరుగా పీఆర్‌అండ్‌ఆర్‌డీ సెక్రటరీకి పంపాల్సి ఉంటుందన్నారు. పీఆర్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో చేపడుతున్న పనులన్నింటిని పూర్తి నాణ్యతతో చేపట్టాల్సి ఉందన్నారు. నాణ్యతను పాటించడంతోనే ఆయా పనులు పదికాలాలు మన్నికగా ఉంటాయన్నారు. తమ పరిధిలో జరుగుతున్న సీసీ రోడ్లు, ప్రాధాన్యత భవనాలు, డ్రైనేజీలు తదితర పనులను రెగ్యులర్‌గా తనిఖీలు నిర్వహించి రిపోర్టులను ప్రభుత్వానికి పంపేందుకు చర్యలు చేపట్టినట్లు రవీంద్రారెడ్డి చెప్పారు. పీఆర్ క్వాలిటీ కంట్రోల్ విభాగం పేరు మార్చిన విధంగానే ఆర్‌డబ్ల్యూఎస్ క్వాలిటీ కంట్రోల్ విభాగం పేరుతో పాటు విధి విధానాలను కూడా ప్రభుత్వం మార్పు చేసింది.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

■ REGULAR/DISTANCE/DISCONTINUED/FAILURES/DETAINED STUDENTS: 10TH, 12TH, DIPLOMA, BTECH, MTECH, ANIMAL HUSBANDRY (D VETERINARY) BA, BCOM, BSC, MA, MCOM, MSC, BSW, BLIC, BBA, BCA, BED, MPED, LLB, MPHW, MBA, MCA, AGBSC, PHD, GOVT AND PRAVATE JOB ELIGIBLE Cell: 86861 72989 [L-798936]

MATHS COACHING

■ B.Tech/ Degree / Diploma/ Inter వారికి Supply & Regulars కి, ECET కోచింగ్ ఇవ్వబడును. (All Subjects) Birla Compound, KNL. Cell: 94905 42826 [L-781157]

REAL ESTATE

PLOT FOR SALE

■ ఓర్వకల్లు ఎయిర్ పోర్టు వెనుక శకునాల ఇండస్ట్రియల్ హబ్ దగ్గరలో సోలార్ పార్క్ ప్రక్కన, 30x40 (2.75 సెంట్లు) సెంటు 1.20 లక్షలు. ప్లాటు కేవలం 3.30 లక్షలు మాత్రమే. నితిక డెవలపర్స్, 98884 24222 ఏజెంట్లు కావలెను. [L-798937]

■ నెలసరి కంతులతో కర్నూలు– నంద్యాల రోడ్, తిప్పాయిపల్లె దగ్గర ఓపెన్ ప్లాట్లు కలవు. & ఓర్వకల్లు MRO ఆఫీస్ దగ్గర ఓపెన్ ప్లాట్లు కలవు. సంప్రదించండి: 99638 00314 [L-781158]

SERVICES

■ షూరిటీ, సెక్యూరిటీ, వ్యక్తిగత, వ్యాపార, వ్యవసాయంపై అతి తక్కువ వడ్డీతో రుణం ఇవ్వబడును. Mr. Rohit Wonder Capital PH: 9041114468 [W-788953]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు సంప్రదించండి
94909 94349
94412 10725

బంగారం కొనబడును

■ మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్ / ఫైనాన్స్‌లో తాకట్టులో ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును స్పాట్ క్యాష్ / షిఫ్టింగ్ (రిటైర్డ్ పోలీస్ డిపార్ట్‌మెంట్) గోల్డ్‌ట్రేడింగ్ కం. ఫోన్: 73821 14647 [V-5969]

WANTED

■ కొత్తగా ప్రారంభించిన మా బ్రాంచిలో పని చేయుటకు 39 స్త్రీ/పు కావలెను. జీ:14వేలు+బోనస్+DA6వేలు +భోజనం, ఫ్రీరూం. అ:7th-డిగ్రీ, ITI, డిప్లొమా (P/F). కల్లూరు రోడ్, కర్నూలు. 80748 16824. [L-781155]

■ కో–ఆపరేటివ్ సొసైటీ నందు పనిచేయుటకు రికవరీ ఏజెంట్లు కావలెను. డిగ్రీ: ఇంటర్వ్యూ తేది: 25–11–2023, 9AM to 1PM, 4th ఫ్లోర్, ఐకాన్ షాపింగ్ కాంప్లెక్స్, కర్నూలు. 83413 80122, 95027 66466 [L-798938]

■ WANTED QUALIFIED AND EXPERIENCED TEACHERS TO TEACH BIOLOGY & TELUGU SUBJECTS FOR HAIGHER CLASSES. CONTACT: 94939 02958. [L-798934]

■ Wanted Lady Teachers to teach class IV and V English subject attend interview on 24-11-2023 at 10 am with all your testimonials. Contact The Orion School, Sri Sainath Nagar, Near Gooty Flyover, Kurnool. 92469 22675. [L-798940]

■ Wanted Bank Field Verification Executives : Kurnool, Pattikonda, Banaganapalli, Nandikotkur. Contact: 72888 03402, 77939 10928. [NA-6071]

■ UC Info Tech సంస్థ నందు (20,000/- to 25,000/-) పనిచేయుటకు వయస్సు : 18-28 లోపు (Unmarried) యువతీ, యువకులు కావలెను. (10th - PG) ఉచిత వసతి కలదు. ఫోన్: 77996 54777, 93905 28568 [V-3435]

■ మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా మా కంపెనీ యొక్క Message పంపుతూ వారానికి 3500/- సంపాదించుకోండి. వాట్సాప్ చేయండి. సంప్ర. 9573633520, 9059633520. [M-1221877]

■ కస్టమ్స్ కాలనీ VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు ఆయా, నర్సులు, వంట చేయువారు, RMP & డాక్టర్స్ కావలెను. జీ: 15000 - 40000/-, ఫ్రీ రూమ్ + భోజనం. Hyd, Ph: 8919613984 [HA-898]

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం. జీ: 18K , Ph: 9160900024/ 9640400073 [HA-896]

■ అద్భుత అవకాశం Hydలో గల ప్రముఖ రియల్ ఎస్టేట్ కంపెనీలో పనిచేయుటకు మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. ఫిక్స్డ్ సాలరీ +కమీషన్ +ఇన్సెంటివ్స్ + రూమ్ + భోజనం ఉచితం 10th, ఇంటర్, డిగ్రీ పాస్ ఫెయిల్ సంప్రదించండి. Ph: 7013191934. 7989371766 [H-193326]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడ మైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.